# అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

## ప్రచారంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్, అక్టోబర్ 19 : సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలన్నింటినీ అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. గురువారం మండలంలోని సిద్దాపూర్ తండా, సేడియగుట్ట తండా, గొటిగార్‌పల్లి, బడంపేట, పర్సపల్లి, ఖానాపూర్, కొత్తూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ దేశాన్ని 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజల అభివృద్ధికి ఏమీ చేయలేదని విమర్శించారు. కానీ, మరోసారి అవకాశం కావాలని అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. అవకాశం ఇచ్చినప్పుడూ ఏమాత్రం పట్టించుకోని పార్టీ మరోసారి అధికారం కోసం నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. వికారాబాద్‌లోని బీజేపీ నాయకుడిని తీసుకువచ్చి జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. స్థానికులకు కాకుండా వేరే ప్రాంతం వాళ్లకు టికెట్ కేటాయించడం ఇక్కడి దళితులకు అవమానకరమన్నారు. వికారాబాద్‌లో చెల్లని నోటు ఇక్కడ చెల్లుతుందా అని ప్రశ్నించారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, నిరంతర కరెంటు అప్పుడు ఎందుకు ఇవ్వలేదని సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ మాత్రమే ప్రజల అభివృద్ధి గురించి పని చేస్తుందన్నారు. ఎంత చిన్న గ్రామం అయినా కూడా అభివృద్ధి కోసం రూ.50లక్షల కంటే ఎక్కువ నిధులను ఖర్చు చేశామని వెల్లడించారు. తనతో పాటు సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు.

### అభివృద్ధి చేయని కాంగ్రెస్..
**రాష్ట్ర బెవరేజస్ క్పారేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్**


ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలను ఏమాత్రం అభివృద్ధి చేయలేదని రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్ అన్నారు. ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. యువతకు ఉపాధి కల్పించలేదన్నారు. రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నదన్నారు.

### ఘన స్వాగతం..

ఎన్నికల ప్రచారం ప్రారంభంలో భాగంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు, నియోజకవర్గ సమన్వయకర్త దేవీప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్, బీఆర్ఎస్ ముఖ్యనేతలు పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, సర్పంచులు అనుసూజమ్మ, తుల్జమ్మ, రాములమ్మ, కల్పన, కృష్ణ, నర్సింహులు, ఎంపీటీసీ బక్కారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ స్రవంతిరెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కలీం, సవూద్, సాలేబాబా, ఆనంద్, నాగరాజు, భూమయ్య, మొల్లయ్య, కరణ్, నర్సింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సందీప్, వినోద్, రత్నం, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, నేతలు


డప్పు చప్పుళ్లతో గొటిగార్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రెడ్డిపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

# బీఆర్ఎస్‌లో చేరికలు

**మెదక్ ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కాంగ్రెస్ నాయకులు**

చేగుంట, అక్టోబర్ 19 : తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో ఇతర పార్టీల నాయకులు చేరుతున్నట్లు ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో గురువారం చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ,కాంగ్రెస్ నాయకులు వంద మంది పార్టీకి రాజీనామా చేసి ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో పాటు చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన 50 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎంపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రజనక్ ప్రవీన్ కుమార్, జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, ఇబ్రహీంపూర్ సర్పంచ్ దొరగొళ్ల రాములు, సొసైటీ మాజీ చైర్మన్ కోమండ్ల నారాయణరెడ్డి, రెడ్డిపల్లి వైస్ చైర్మన్ తీగుళ్ల ఆంజనేయులు, ఎగ్గడి శేఖర్ తదితరులు ఉన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన ఇబ్రహీంపూర్‌కు చెందిన బీజేపీ,కాంగ్రెస్‌నాయకులు

# శిక్షణకు ఎన్నికల సిబ్బందిని సిద్ధం చేయాలి

**■ సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 19 : జిల్లాలో ఎన్నికల సిబ్బంది శిక్షణ కోసం షెడ్యూల్ సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్లు ప్రతి అంశంపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చే సమయంలో వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం ఆపరేట్ చేయడం, ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలను, ప్రీ పోల్, పోలింగ్ తర్వాత చేయాల్సిన పనులు చెప్పాలన్నారు. రిటర్నింగ్ అధికారి స్థాయిలో కూడా శిక్షణ ఇవ్వాలని ఆర్వోలకు సూచించారు. ఎన్నికల సిబ్బంది శిక్షణకు సంబంధించిన షెడ్యూలు సిద్ధం చేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. డీఆర్వో నగేశ్, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి, ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

జిల్లాలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రీవెన్స్ కమిటీలో నోడల్ అధికారిగా డీసీవో తుమ్మ ప్రసాద్, సభ్యులుగా డీటీవో కవిత, డీఆర్డీవో శ్రీనివాసరావును నియమించినట్లు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేల కంటే మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న, రవాణా చేస్తున్న నగదు సీజ్ చేస్తున్నామన్నారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి సదరు వ్యక్తులు పూర్తి ఆధారాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పిస్తే, కమిటీ పరిశీలించి నగదును విడుదల చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులను 9100115691, 9281487272, 7799934135 నెం బర్లపై సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## స్వీప్ కార్యక్రమాలు విస్తృతం చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 19 : జిల్లాలో స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్ అవేర్‌నెస్ ఫోరాలు ఏర్పాటు చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్వీప్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమల్లో ఓటర్ అవేర్‌నెస్ ఫోరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ఏరియాల్లో ప్రతి సంస్థలో పనిచేస్తున్న అధికారులలో ఒకరిని నోడల్ అధికారిగా నియమించి ఓటు వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామం, మండల నియోజకవర్గం, మున్సిపాలిటీ కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు వేయాలన్నారు. ప్రతి గ్రామంలోని పోలింగ్ కేంద్రం స్థాయిలో చునావ్ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్ టర్న్ అవుట్ తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఓటు వేయడంపై ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు, మహిళలకు రంగో లీ పోటీలు నిర్వహించాలని సూచించారు. రైతులు, థర్డ్ జెండర్, యువత, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఓటు హక్కు వినియోగం, ఈవీఎంపై అవగాహన పెంచాలన్నారు. ఈ సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి, డీఆర్వో నగేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

పాల్గొన్న అధికారులు ↓
